క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

తానూరు: మండలంలోని తొండాల గ్రామంలో ఇటీవల నిర్మించిన మహాదేవ్ ఆలయంలో సోమవారం నిర్వహించే విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావ్ పటేల్ రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కార్యకర్తలు, అభిమానులు హాజరవాలని కోరారు.

తోటలో అగ్నిప్రమాదం

కడెం: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వెంబడి శేఖర్ నీలగిరితోటలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఐదెకరాల తోటలో కొన్ని చెట్లు దెబ్బతిన్నాయని.. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి బాధిత రైతు వేడుకుంటున్నాడు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మార్గ్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా శివరాం వెంకటేశ్, కోశాధికారిగా చిట్టిమల సాదయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీ రాజ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మారెడ్డి శ్రీనివాస్, గోండ శంకర్, తొడిశెట్టి పరమేశ్వర్ వ్యవహరించారు.

నిజాయతీ చాటిన కండక్టర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఓ మహిళా కండక్టర్ బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన పర్సును తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం జగిత్యాల నుంచి నిర్మల్‌కు వచ్చిన బస్సులో మనోజ్ఞ అనే మహిళ సీటులో పర్సు మరిచిపోయి నిర్మల్ బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయింది. గమనించిన కండక్టర్ శ్యామల పర్సులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా ఆమెకు ఫోన్ చేసి నిర్మల్ బస్టాండ్‌లో పర్సును అందజేశారు. పర్సులో రూ.20 వేలు, చెవికమ్మలు ఉన్నవి. ఈసందర్భంగా నిజాయతీ చాటిన మహిళా కండక్టర్‌ను డిపో మేనేజర్ పండరి అభినందించారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు శ్రీనివాస్

కడెం: మండలకేంద్రంలోని రామాలయం వద్ద ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ నూతన మండల కార్యవర్గం ఎన్నికపై మండలంలోని ఆయా గ్రామాల నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో మండల ఇన్‌చార్జి అకుల శ్రీనివాస్, క్లైం రమణారెడ్డి, నల్ల రవీందర్‌రెడ్డి, సత్తెన్న, రాజేందర్, రాజేశ్, మోహన్‌నాయక్, శ్రీరాం, బుర్ర సాయి తదితరులున్నారు.

వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ సంఘ భవనంలో ఉచిత వైద్య(ఆర్థోపెడిక్) శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అన్వేశ్‌గౌడ్ బృందం సుమారు 250 మందికి ఉచితంగా బీఎండీ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ఆవోపా బాధ్యులు జొన్న వినోద్, టి.నారాయణ, దయానంద్, అయిత రమణ, మంత్రి శ్రీనివాస్, పోలిశెట్టి విలాస్, శ్రీమాల, మాధవి, లావణ్య పాల్గొన్నారు.

కిసాన్‌మేళాకు ప్రత్యేక బస్సు

సోన్: నిజామాబాద్ జిల్లాలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 21, 22, 23 తేదీలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కిసాన్ మేళాను రైతులు వినియోగించుకోవాలని ఏవో వినోద్‌కుమార్, ఏఈవో ఉమామహేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, స్టాల్స్ ప్రదర్శించబడతాయని తెలిపారు. ఈనెల 23న ఉదయం సోన్ మండలం కేంద్రం నుంచి కిసాన్‌మేళాకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని.. ఆసక్తి కల్గిన రైతులు క్లస్టర్ పరిధిలోని ఏఈవో వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



ఇళ్ల మధ్యే పిచ్చిమొక్కలు, మురుగు నీరు

వైఎస్సార్ కాలనీలో అధ్వానంగా పారిశుద్ధ్యం

జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల చుట్టూ మురుగునీరే దర్శనమిస్తోంది. భగీరథ నీరు కూడా అపరిశుభ్రంగా వస్తుండటంతో తాగడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. 15 ఏళ్లుగా గోస పడుతున్నామని.. ఇప్పటికైనా పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి వసతులు కల్పించాలని వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



చేతిపంపు వద్ద చెత్తాచెదారం



డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేని వీధి



మురుగు నీటిని చూపుతున్న కాలనీవాసులు



వాటర్ ట్యాంక్ పక్కనే పారుతున్న మురుగునీరు

డబుల్ ఇళ్లు ఎప్పుడిస్తరో?

- నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కేటాయించని వైనం
- భైంసాలో ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- వసతులు కల్పించి అందిస్తామంటున్న అధికారులు

భైంసాటౌన్: పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భైంసా శివారు పార్డి(బి) రోడ్డులో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారుల ఎంపిక సైతం పూర్తయింది. కానీ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు కేటాయించలేదు. మరోవైపు తమకు కేటాయించిన ఇళ్లను అప్పగించాలంటూ లబ్ధిదారులు.. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలుమార్లు రోడ్డెక్కి ధర్నాలు కూడా చేపట్టారు. విసిగిపోయిన పలువురు డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వెళ్లి తాత్కాలికంగా నివాసం ఉండటంతో అధికారులు వారికి సర్దిచెప్పి ఖాళీ చేయించారు. మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వానికి నివేదించామని.. నిధులు రాగానే పనులు పూర్తి చేసి ఇళ్లను అప్పగిస్తామని ఆర్డీవో కోమల్‌రెడ్డి లబ్ధిదారులను పలుమార్లు సముదాయించారు. కొన్నినెలల కిందట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భైంసాకు రాగా అధికారులు, ప్రజాప్రతినిధులు డబుల్ బెడ్ రూం ఇళ్ల సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు.

ఎట్టకేలకు నిధులు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలో మొదటివిడతలో 200, రెండో విడతలో 440 మొత్తం 640 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా నిర్మాణం పూర్తయింది. మొదటి విడతలో నిర్మించిన 200 ఇళ్లలో ముంపు గ్రామం గుండెగాం వాసులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. మిగిలిన 440 ఇళ్లకు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే, తాగునీరు, మురుగు నిర్వహణ ఏర్పాట్లు చేయకపోవడంతో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. పలుమార్లు లబ్ధిదారుల ఆందోళనతో ఎట్టకేలకు ప్రభుత్వం ఇటీవల రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ చేతుల మీదుగా పనులకు భూమిపూజ చేశారు.



పట్టణంలోని డబుల్ బెడ్ రూం గృహ సముదాయం



పగిలిన కిటికీల అద్దాలు



పెరిగిన పిచ్చి మొక్కలు

మిగిలినవి ఏం చేస్తారు..

పట్టణంలో పేదల కోసం 640 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా, 440 ఇళ్లకు మాత్రమే అధికారులు లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగిలిన 200 ఇళ్లలో ముంపు గ్రామం గుండెగాంవాసులు తాత్కాలికంగా నివాసముంటున్నారు. వారికి పునరావాసం కోసం స్థల పరిశీలన చేస్తున్నారు. వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తే 200 ఇళ్లు ఖాళీ అవుతాయి. ఈ నేపథ్యంలో ఈ ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించి అందిస్తారా.. లేదా.. ఇంకా ఏ నిర్ణయం తీసుకుంటారోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటికయ్యేనో...!

తాగునీరు, మురుగు నిర్వహణ కోసం నిధులు కేటాయించినా.. ఇంకా గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఎలక్ట్రికల్ సంబంధించిన పనులు సైతం చేపట్టాల్సి ఉంది. కానీ ఇందుకు నిధులు కేటాయించలేదు. రూ.54లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లు ఎప్పటికీ కేటాయిస్తారోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నిర్మించిన పలు ఇళ్లలో కిటికీల అద్దాలు పగిలి పిచ్చి మొక్కలు పెరిగాయి. తలుపులు ఊడిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని.. త్వరగా పనులు పూర్తి చేసి ఇళ్లను అప్పగించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలి. అలాగే కరెంట్ సౌకర్యంతోపాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కూడా నిర్మించాలి.

– జి.రాజు, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి, భైంసా

ఇళ్లు అప్పగించాలి

సొంత ఇల్లు లేక ఓవైసీనగర్‌లో నెలకు రూ.2వేలతో అద్దెకు ఉంటున్నాం. లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్‌రూం ఇంటికి మమ్మల్ని ఎంపిక చేశారు. కానీ తాగునీరు, కరెంట్, మురుగు వసతి లేదని అధికారులు ఇంటిని కేటాయించలేదు. మంజూరైన నిధులతో పనులు చేసి ఇళ్లు అప్పగించాలి.

– ఆయేషా, ఓవైసీనగర్, భైంసా

అద్దె ఇంట్లో ఉంటున్నాం

మేం పాండ్రిగల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రతినెల అద్దె చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం లక్కీడ్రా ద్వారా కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరగా అప్పగించాలి. కనీస సౌకర్యాలు కల్పించాలి.

– అన్విక, పాండ్రిగల్లి, భైంసా

గడ్డెన్న సేవలు మరువలేనివి



గడ్డెన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన మాజీ మంత్రి గడ్డెన్న సేవలు మరువలేనివని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలో మాజీ మంత్రి గడ్డెన్న 21వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డెన్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. బస్టాండ్‌లో గడ్డెన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గడ్డెన్న ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు అందించారన్నారు. నియోజకవర్గ వాసులతోపాటు ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకులు గడ్డెన్నను కాకా అని ఆప్యాయంగా పిలిచేవారన్నారు. తనకున్న ఆత్మీయ సంబంధం గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి సీఎం డా.వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టణ సమీపంలోని ప్రాజెక్టుకు గడ్డెన్నవాగు ప్రాజెక్టుగా నామకరణం చేశారని వివరించారు. అనంతరం గడ్డెన్న కుటుంబీకులు అన్నదానం చేశారు.

చదువుతోనే ఉన్నతస్థానం



ప్రశ్నపత్రాలతో రజనీకాంత్, టీజీఎల్ఏ సభ్యులు

భైంసాటౌన్: ఉన్నత చదువులతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు దక్కుతాయని యువత సమయం వృథా చేయకుండా ఉన్నత చదువులు చదవాలని డాక్టర్ రజనీకాంత్, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణంలోని పులేనగర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో భైంసాకు చెందిన సాయిసుప్రియ హాస్పిటల్ సౌజన్యంతో, టీజీఎల్ఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీట్ మాక్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా పలు కళాశాలల విద్యార్థులు మాక్‌టెస్ట్‌కు హాజరయ్యారు. అంతకుముందు నిర్వాహకులు మాట్లాడుతూ.. చదువుతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. నీట్, ఇతర పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఎల్ఏ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ



రాయపూర్‌కాండ్లీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాస్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జాన్సన్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, పిప్రి గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో పాస్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా పలువురు ఆలపించిన గీతాలు, చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం అన్నదానం చేశారు. సంఘం సభ్యులు ప్రేమనందం, నవీన్‌కుమార్, దేవన్న పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా చర్చి పాస్టర్ కిరణ్‌కుమార్, క్రైస్తవులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రదీప్, శ్రావణ్, అజయ్, మహిపాల్ ఉన్నారు.

రేపు సొసైటీ సర్వసభ్య సమావేశం

మామడ: జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రాజాబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి సీతక్కతో నాయకులు

ఖానాపూర్: ఉట్నూర్‌లో రాష్ట్ర మంత్రి సీతక్కను కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలోని ప్రజాసమస్యలు ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ విన్నవించారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు వైడింగ్ పనులు, ఖానాపూర్‌లో రెవెన్యూ డివిజన్, బస్ డిపో ఏర్పాటుతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సారంగాపూర్: మండలంలోని హనుమాన్ తండాకు చెందిన మాజీ ఎంపీపీ పవార్ శివంతాబాయి, మహవీర్‌తండాకు చెందిన మాజీ సర్పంచ్ పవార్ రవీందర్ తల్లి అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, చందు, రాజేందర్, మహేశ్, భాస్కర్, రవికిరణ్, తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

తానూరు: మండలంలోని ఝరి(బి)లో ఫ్రెండ్స్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముథోల్ ఓంసాయి ఎలక్ట్రికల్ టీం ప్రథమ, ఝరి(బి) ఫ్రెండ్స్‌టీం ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రథమస్థానంలో నిలిచిన క్రీడాకారులకు ఝరి(బి) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.30వేల నగదు, కప్పు అందజేశారు. ఝరి(బి)ఫ్రెండ్స్ టీంకు రూ.15 వేలు అందజేశారు. బాలాజీ, పృథ్వీరాజ్, శివదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదువుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని నిర్మల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మస్కాపూర్‌లో ఓ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. రచయిత షియాన్ సంపత్, టీఎస్‌జీవో నాయకులు నాగరాజు, కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డైరెక్టర్ మదిరె శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతలు పూడ్చివేయరూ..



తానూరు: మండలకేంద్రంలోని ఎక్స్ రోడ్డు నుంచి ఉమ్రి(కే) గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో నిత్యం మట్టి టిప్పర్లు నడుస్తుండటంతో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు గుంతలను పూడ్చి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కమలాకర్, పీఆర్ డీఈ, ఫోన్: 91211 35604

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం



గ్రంథాలయం ఎదుట ఆహ్లాదంగా మొక్కలు, పచ్చగడ్డి



ఇటీవల కాలిన పచ్చిగడ్డి, మొక్కలు

తానూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న హౌసింగ్ కార్యాలయ భవనంలో రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం గ్రంథాలయం ఏర్పాటు చేసింది. పోటీపరీక్షల పుస్తకాలతోపాటు రూ.లక్ష వెచ్చించి పెయిటింగ్, అలంకరణ మొక్కలు, గడ్డి ఏర్పాటు చేసి భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కానీ నీటిని అందించకపోవడంతో కొన్ని మొక్కలు, పచ్చగడ్డి ఎండిపోయాయి. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి నిప్పంటించడంతో కాలిబూడిదయ్యాయి. అధికారులు స్పందించి బతికి ఉన్న మొక్కలకైనా నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాలు వేగంగా నడిపితే చర్యలు

లోకేశ్వరం: వాహనాలు అతివేగంగా నడిపితే కఠిన చర్యలు తప్పవని లోకేశ్వరం ఎస్సై అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై దిగంబర్, పోలీస్ సిబ్బంది రాజ్‌కుమార్ ఉన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

భైంసాటౌన్: పట్టణంలోని పలు లాడ్జీల్లో ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆర్కే, సాక్షి తదితర లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విజిటర్ రిజిస్టర్, ఇతర వివరాలు పరిశీలించారు. అపరిచితులకు రూంలు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై గౌసుద్దీన్ తదితరులు ఉన్నారు.